క్లుప్తంగా

ఇంటర్‌లో అడ్మిషన్లు

మదనపల్లె సిటీ: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ పొందడానికి ఈ నెల 31వతేదీలోపు చేరాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ బాలకృష్ణమూర్తి తెలిపారు. పదో తరగతి పాసై, డ్రాప్ అవుట్స్, ఓపెన్ స్కూల్ ద్వారా పాసైన విద్యార్థులు కాలేజీలో చేరవచ్చునన్నారు. ప్రతి ఏడాది ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని, అన్ని సదుపాయాలు ఉన్నాయని పేర్కొన్నారు.

అభ్యసన సామగ్రి పంపిణీ

కురబలకోట: మండలంలోని నందిరెడ్డిగారి పల్లె మోడల్ ప్రైమరీ పాఠశాలలోని 120 మంది విద్యార్థులకు అక్కడి ఉపాధ్యాయులు షాజీరా, ఎస్.జప్పల్లాబాషా రూ. 20 వేలు విలువ చేసే అభ్యసన సామగ్రిని మంగళవారం అందజేశారు. ఎంఈఓలు ద్వారకనాథ్, శ్రీనివాసులు ఆధ్వర్యంలో వాటిని అందజేశారు. దాతలను గ్రామస్థులు అభినందించారు.

రేపు మెగా జాబ్‌మేళా

రాయచోటి జగదాంబసెంటర్ : ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లాలోని బి.కొత్తకోటలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఈ నెల 31వ తేదీన ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగమేళాకు పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని ఆసక్తి గల యువతీయువకులు ఉద్యోగమేళాను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 96186 55759, 95532 02509, 97414 32931, 88977 76368 నెంబర్లను సంప్రదించాలని తెలియజేశారు.

అరెస్టులతో అణగదొక్కలేరు


ఎంపీపీ శ్రీదేవి

కలకడ: నవరత్నాల సంక్షేమ పథకాలను పేదలకు అందించిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల అండదండలు మెండుగా ఉన్నాయని, ముఖ్య నేతలపై అక్రమ కేసులు పెట్టి వైఎస్సార్‌సీపీని అణగదొక్కలేరని ఎంపీపీ శ్రీదేవి అన్నారు. విలేకరులతో మంగళవారం ఆమె మాట్లాడుతూ లిక్కర్ స్కాం అంటూ హడావిడి చేసి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిని అరెస్టు చేయడం దారుణమన్నారు. ప్రజలు, కార్యకర్తలు అంతా గమనిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నరవుతున్నా ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు శ్రద్ధ చూపడం లేదన్నారు. కూటమి నేతలు సంక్షేమ పథకాలు అందించడం, అభివృద్ధి చేయడంపై దృష్టి సారించాలని, అక్రమ కేసులు నమోదు చేయించడం మంచిది కాదని హితవుపలికారు.

మొక్కలు నాటి సంరక్షించాలి


కార్యక్రమంలో దీపా వెంకట్, తదితరులు

పీలేరురూరల్: ప్రతి విద్యార్థి తమ తల్లి పేరుతో మొక్కలు నాటి సంరక్షించాలని స్వర్ణ భారత్ ట్రస్టు ఫౌండర్ దీపా వెంకట్ అన్నారు. స్థానిక వీఎస్ఎన్ పాఠశాలలో ఏక్ పేడ్, మా కే నామ్ కార్యక్రమానికి మంగళవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో ఎలాంటి పరిమితులు, షరతులు లేకుండా ప్రేమించేది తల్లి మాత్రమే అన్నారు. తల్లి తరువాత మొక్కలు మాత్రమే స్వచ్ఛమైన ప్రేమ అందించగలవని తెలిపారు. అనంతరం కేవీపల్లె మండలం గాలివారిపల్లె ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ చంద్రశేఖర్, లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి, శివశంకర్, మాధవి పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలతో పోలీస్ నిఘా

పెద్దతిప్పసముద్రం: కర్నాటక రాష్ట్ర సరిహద్దులో ఉండడంతో పెద్దతిప్పసముద్రం మండలంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసుల నిఘా ముమ్మరం చేశారు. మదనపల్లి డీఎస్పీ మహేంద్ర పర్యవేక్షణలో మంగళవారం పోలీస్ బృందం శివారు ప్రాంతాలను డ్రోన్ కెమెరాతో పరిశీలించింది. అక్రమ రవాణా, కోడి పందేలు, పేకాట జరిగే స్థావరాలను క్షుణ్ణంగా చిత్రీకరించారు. ఈ ప్రక్రియ కొనసాగుతుందని పోలీసువర్గాలు చెబుతున్నాయి.

చంద్రబాబు మమ్మల్ని మోసం చేశారు


బి.కొత్తకోట: కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు

బి.కొత్తకోట: అమ్మా చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలై మీ ఖాతాలకు సొమ్ములు జమయ్యాయా..సూపర్ సిక్స్ పథకాలు మీ ఇంటికి అందాయా, అయ్యా మీకు పింఛన్ మంజూరైందా అంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు లబ్ధిదారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని తుమ్మనంగుట్ట, కోటావూరు, గోళ్లపల్లె, బండారువారిపల్లె పంచాయతీల్లో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం హామీలపై వారు ప్రజలను ఆరా తీశారు. నాయకులు మాట్లాడుతూ ఎన్నికల్లో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వాటిని విస్మరించి ప్రజలను మోసం చేశారని వివరించారు. అధికారం కోసం ఎన్ని హామీలైనా ఇచ్చే చంద్రబాబు నైజాన్ని ప్రజలకు తెలుపుతూ కూటమి ప్రభుత్వంలో ఏఏ పథకాలు మంజూరయ్యాయి? వాటి ద్వారా కలిగిన ఆర్థిక లబ్ధి గురించి పార్టీ నేతలు అడిగి తెలుసుకున్నారు. పల్లెల్లో పొలం పనులకు వెళ్లిన వారి వద్దకూ వెళ్లి ఎన్నికల హామీలు, మోసాలను వివరించారు. ఎన్నికల్లో టీడీపీని నమ్మి మోసపోయామని, ప్రభుత్వం తమకు మేలు చేస్తుందనే నమ్మకం లేదని స్పష్టంగా చెబుతున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఉజ్జయిని సాంబశివ, జెడ్పీటీసీ రామచంద్ర, వైస్‌ఎంపీపీ ఖాదర్‌వలి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి అంటే ఏమిటో చేతల్లో చూపించిన వ్యక్తి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. ప్రతిపల్లెకు, ప్రతిగ్రామానికి తారురోడ్లు, సిమెంటు రోడ్లు నిర్మించి రవాణా సౌకర్యం మెరుగుపర్చడంలో ఆయన చేసిన కృషి 75 ఏళ్ల చరిత్రలో ఏ ఎమ్మెల్యే చేయలేదన్నారు. ఈ నాలుగు పంచాయతీల్లో రూ.10 కోట్లతో తారు రోడ్లు, రూ.3 కోట్లతో ప్రభుత్వ భవనాలు, రూ.2 కోట్లతో సీసీరోడ్లు, తాగునీటి బోర్లు, మురికి కాల్వల నిర్మాణాలు జరిగాయన్నారు. ఏడాదిలో కూటమి పాలనపై ప్రజల్లో ఆశల పొరలు తొలగిపోయాయని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు క్యూఆర్ కోడ్ ద్వారా తమ అభిప్రాయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచులు పుష్పలత, ప్రమీల, రుక్మిణి, ఎంపీటీసీలు విమలమ్మ, ఈశ్వరమ్మ, రెడ్డిహరి, కాండ్లమడుగు విజయారెడ్డి, గంగరాజు, శివన్న, ఆనందరెడ్డి, కేశవ, విజయభాస్కర్‌రెడ్డి, అమరనాధరెడ్డి, సతీష్‌కుమార్, శివారెడ్డి, ఇమాం, అజీబ్, ఎ.మాలిక్, బయ్యారెడ్డి, మస్తాన్, శ్రీకాంత్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మరోసారి ప్రజలకు దగా


కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

ములకలచెరువు: సూపర్ సిక్స్ పేరుతో మరోసారి ముఖ్యమంత్రి చంద్రబాబు తమను మోసం చేశాడని... ప్రజలు తెలిపారు. మండలంలోని మద్దినాయునిపల్లి, బురకాయలకోట పంచాయతీల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రజలకు కూటమి వైఫల్యాలను వివరించారు. మాట మీద నిలబడే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మోసం చేశామని మహిళలు కంటతడి పెట్టారు. ఎంపీపీ సాయిలీల, వై.విజయమ్మ, రహమత్‌బీ, రాంబాబునాయుడు, వై.రవిశేఖర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రెడ్డిశేఖర్‌నాయుడు, ఉమామహేశ్వర్, డాక్టర్ విశ్వనాథ్, టంగుటూరి శ్రీనివాసులు, చాంద్‌బాషా, విజయ్‌కుమార్‌రాజు, రామనాథం, రెడ్డెం క్రిష్టారెడ్డి, అన్సర్ బాషా తదితరులు ఉన్నారు.

హామీలతో ప్రజలను మభ్యపెట్టారు


వైఎస్సార్‌సీపీ నాయకులతో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కేవీపల్లె: సంక్షేమ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. కేవీపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకులను మంగళవారం కలసిన ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని అమలుచేయకుండా మోసం చేసిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం గాలికొదలి వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. బలమైన నాయకులపై కేసులు పెట్టి జైలుకు పంపి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. మచ్చలేని నాయకుడుగా నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిపై లిక్కర్ కేసు పెట్టి జైలుకు పంపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. పెద్దిరెడ్డి కుటుంబంపై కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని చెప్పారు. అనంతరం కేవీపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సైపుల్లాఖాన్ సోదరుడు పఠాన్ ఖాదర్‌ఖాన్ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులు పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి సోదరుడు ప్రభాకర్‌రెడ్డి ఆరోగ్యం బాగాలేనందున ఇంటి వద్ద ఉండగా ఆయన్ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జయరామచంద్రయ్య, సి.కె.ఎర్రమరెడ్డి, రత్నాకర్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, రామకొండారెడ్డి, పి.ద్వారకనాథరెడ్డి, కోర్టు సుబ్బారెడ్డి, సిద్దయ్య, రెడ్డెప్పరెడ్డి, బాలకృష్ణ, మహేష్‌రెడ్డి, సోము, యల్లయ్య, రవీంద్రరెడ్డి, అడవిపల్లె రాజన్న, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో ప్రభుత్వం విఫలం


పెద్దతిప్పసముద్రం మండలంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెద్దతిప్పసముద్రం: కూటమి ప్రభుత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారని ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ ఉంగరాల శివన్న, వైస్ ఎంపీపీ శోభాశంకర్, కో–ఆప్షన్ సభ్యుడు ఖాదర్‌వలి ఆరోపించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మద్దయ్యగారిపల్లి, కాట్నగల్లు, పులికల్లు, దేవప్పకోట పంచాయతీల్లో మంగళవారం వారు విస్తృతంగా పర్యటించారు. సంక్షేమం, అభివద్ధి రెండు కళ్లుగా జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు తీసుకెళ్లారని, చంద్రబాబు పాలనలో మాత్రం పథకాలు అందక, వర్షాలు కురవక ప్రజలు నరకయాతన పడుతున్నారని ప్రజలే బహిరంగంగా కూటమి పాలనపై మండిపడ్డారు. కొత్తగా వితంతు పింఛన్లు రాలేదని, జగనన్న హయాంలో భర్త చనిపోయిన రెండు నెలల్లోనే డబ్బులు వచ్చేవని పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి కాట్నగల్లు పంచాయతీలో రూ.కోటికి పైగా నిధులతో ప్రభుత్వ భవనాలు కట్టించి, మారుమూల గ్రామాలకు సైతం తారు రోడ్డు వేయించారని అన్నారు. కాట్నగల్లులో చెన్నకేశవస్వామి ఆలయాన్ని నూతనంగా నిర్మించేందుకు రూ.40 లక్షల నిధులు మంజూరు చేయించారని గుర్తుచేశారు. హామీలను చంద్రబాబు తుంగలో తొక్కి డైవర్షన్ రాజకీయాలు చేస్తుండటంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. రామాంజులు, గిరీష్, వెంకట్రమణమ్మ, సయ్యద్‌బాషా, హరిప్రసాద్, కల్లేగారి మంజు, మెకానిక్ చంద్ర, సందీప్‌రెడ్డి, రాజన్న, మధు, రాజశేఖర్, గిరీస్వామి, మహేష్, మంజు, శంకర్‌రెడ్డి, శివారెడ్డి, యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పేరుతో నిలువునా మోసం చేశారు


తంబళ్లపల్లె: కరపత్రం ద్వారా వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తంబళ్లపల్లె: ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ పేరుతో హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని మహిళలు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని గుండ్లపల్లె, అన్నగారిపల్లె, గంగిరెడ్డిపల్లె పంచాయతీల్లో మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి జయసింహారెడ్డి, సర్పంచులు మౌలాలి, బాబురెడ్డి, నాయకులు రవినాయక్, తులసీనాయక్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వైఎస్ జగన్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల బండిలా పరుగుపెట్టిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి ఊసే లేదని, సంక్షేమం కానరాలేదంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలలో జగనన్న ప్రభుత్వంలో అన్ని రకాల సేవలు అందేవన్నారు. ఇంటివద్దకే రేషన్ నెలనెలా వచ్చేవని తెలిపారు. ఇప్పుడు చౌక దుకాణాల వద్దకు వెళ్లి క్యూలో నిల్చుని తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. పగలంతా పొలాల్లో కష్టపడి ఇంటికి వస్తే ఊరూరా వెలసిన బెల్ట్ షాపులతో గొడవలు, ఘర్షణలు జరుగుతున్నాయన్నారు. ఇంటింటికి వెళ్లి క్యూఆర్ కోడ్‌తో వివరిస్తూ ప్రజల అభిప్రాయాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కరీం, నాయకులు కోటిరెడ్డి, కిషోర్‌రెడ్డి, నారాయణరెడ్డి, పెద్దశేఖర్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, చంద్రశేఖర్, మల్లికార్జున, రఘు, చెన్నకేశవరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే పార్కింగ్‌పై డీఎస్పీ సీరియస్


దుకాణదారులకు సూచనలిస్తున్న డీఎస్పీ

బి.కొత్తకోట: స్థానిక జ్యోతి చౌక్‌లో నడి రోడ్డుపై బైక్‌లను పార్కింగ్ చేయడంపై మదనపల్లె డీఎస్పీ మహేంద్ర సీరియస్ అయ్యారు. బి.కొత్తకోటలో ట్రాఫిక్ పరిస్థితులను మంగళవారం ఆయన స్వయంగా పరిశీలించారు. జ్యోతిచౌక్‌లో బైక్‌లను రోడ్డుపై పార్కింగ్ చేయడం చూసి..తక్షణమే వాటిని తొలగించాలని ఆదేశించారు. మళ్లీ కొంతసేపటికే మళ్లీ బైక్‌లు యథాస్థానంలో కనిపించడంతో సీరియస్ అయ్యారు. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించేలా ఉన్న ఈ నిర్లక్ష్యంపై తక్షణ చర్యలకు సిద్ధమయ్యారు. జరిమానా విధించే ప్రయత్నం చేస్తుండగా బైక్‌లను వాహనదారులు ఒక్కొక్కటిగా తొలగించారు. దుకాణ దారులతో డీఎస్పీ మాట్లాడుతూ బైక్‌లను రోడ్డుపై నిలిపి ఉంచకుండా చూడాలని సూచించారు. వాహనదారులు తమ మాటను ఖాతరు చేయరని, రోజూ ఇదే సమస్య ఉందని వ్యాపారులు డీఎస్పీకి విన్నవించారు. దీనిపై ఇక కఠినచర్యలు తీసుకుంటామని బైక్‌లు పెట్టేవారిని ఆయన హెచ్చరించారు.

మైనర్లకు పోక్సో చట్టం రక్షణ కవచం


అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప

కేవీపల్లె: పోక్సో యాక్టు 18 ఏళ్ల లోపు పిల్లలకు రక్షణ కవచమని ఎస్‌ఐ వి.చిన్నరెడ్డెప్ప అన్నారు. మండలంలోని కేవీపల్లె, సీకేఆర్‌పల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మద్యం, మత్తుపదార్థాలు, గంజాయి వాడకంతో జరిగే అనర్థాలు, పోక్సో యాక్టు, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, బాల్య వివాహాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మైనర్ పిల్లలపై లైంగిక దాడులు జరిగితే 2012 పోక్సో యాక్టు ప్రకారం కఠినమైన శిక్షలు ఉంటాయని తెలిపారు. ఎవరైనా అనుమానస్పదంగా ప్రవర్తిస్తే సమాచారం ఇవ్వాలని, డ్రగ్స్, మాదక ద్రవ్యాల వాడకంతో పిల్లల జీవితాలు నాశనం అవుతాయని తెలిపారు. మితిమీరిన మొబైల్ వాడకం, వీడియో గేమ్స్, వంటివి బాలల ఆరోగ్యంపై ప్రభావం చూపవచ్చునని తెలిపారు. హెచ్‌ఎం వై.వి. రమణ తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌ల్యాండ్‌లో వివరాల తనిఖీ

కేవీపల్లె: వెబ్‌ల్యాండ్‌లో నమోదైన సవరణ దరఖాస్తులను రాయచోటి జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ మంగళవారం తనిఖీ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వెబ్‌ల్యాండ్‌లో నమోదైన దరఖాస్తులు పరిశీలించి ఆమోదించినట్లు తెలిపారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన వినతులు సత్వరమే పరిష్కరించాలని సూచించారు.

ఖైదీలకు వైద్య పరీక్షలు


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాధామాధవి

పీలేరురూరల్: ఖైదీలు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని వైద్యాధికారి డాక్టర్ కె.రాధా మాధవి అన్నారు. స్థానిక సబ్ జైల్‌లోని ఖైదీలకు మంగళవారం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ జైలు అధికారి కె.చంద్రశేఖర్, సి.కృష్ణమ్మ, సరస్వతి, దాక్షాయణి, మనోహర పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల ఉపాధిని దెబ్బతీస్తారా?

మదనపల్లె: లులు సంస్థకు భూములు కేటాయిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను ఉపసంహరించి కేటాయింపులు రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. మీడియాతో మంగళవారం ఆయన మాట్లాడుతూ విశాఖలో 13.83 ఎకరాలు, విజయవాడలో ఆర్టీసీ భూములు 4.15 ఎకరాలను లులుకు కట్టబెట్టడం ద్వారా వేలాది చిరు వ్యాపారుల ఉపాధిని దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. ఆర్టీసీ, ప్రభుత్వ రంగ సంస్థలను బహుళజాతి సంస్థలకు నామమాత్రపు లీజుతో 99 ఏళ్లకు కట్టబెట్టడం దారుణమన్నారు. చిన్న, మధ్య తరహా వ్యాపారాలు సంక్షోభంలో పడ్డాయని, ఈ సంస్థలతో వాటి ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రిటైల్ రంగంలోకి బడా కంపెనీలు రంగ ప్రవేశం చేస్తే స్థానిక వ్యాపారరంగం నాశనం అవుతుందన్నారు. ఇప్పటికే ఎన్నికల హామీలను అమలు చేయక ప్రజల్లో వ్యతిరేకత పెంచుకున్న ప్రభుత్వం కంపెనీలకు రెడ్ కార్పెట్ వేసి విలువైన భూములు ఇవ్వడంతో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేయాలి


నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మదనపల్లె రూరల్: ప్రభుత్వ పాఠశాలల కిచెన్ గార్డెన్ అభివృద్ధికి కేటాయించిన నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ చేసి వివరాలను బహిర్గతం చేయాలని ఏఐఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మాధవ్ డిమాండ్ చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట విద్యార్థులతో కలిసి మంగళవారం నిరసన తెలిపారు. మాధవ్ మాట్లాడుతూ...కిచెన్‌గార్డెన్ అభివృద్ధి కోసం ప్రభుత్వం కేటాయించిన రూ.85 వేల నిధులను మండల విద్యాశాఖ అధికారులు కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. వాటిపై విచారణ జరిపి, కాజేసిన నిధులను రికవరీ చేసి సంబంధిత పాఠశాలలకు మళ్లీ కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో భవిత, సాయికిరణ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు తరుణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మళ్లీ కౌన్సిల్ అత్యవసర సమావేశమేనా?

మదనపల్లె: అధికారుల తీరుకు పట్టణ ప్రజల సమస్యలకు పరిష్కారం, అభివృద్ధి అంశాలపై చర్చించే అవకాశం లేకుండాపోతోంది. మదనపల్లె సెలెక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీ కౌన్సిల్ సాధారణ సమావేశం జరగకపోవడమే ఇందుకు కారణం. గత 2024 మార్చి, 29న ఉదయం 11 గంటలకు సాధారణ సమావేశం, మధ్యాహ్నం 12 గంటలకు అత్యవసర సమావేశం నిర్వహించగా వాయిదాపడ్డాయి. ఈ ఏడాది ఏప్రిల్ 30న ఉదయం 11 గంటలకు కౌన్సిల్ ప్రత్యేక సమావేశం, అదే రోజున మధ్యాహ్నం 12 గంటలకు కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. సాధారణ సమావేశం నిర్వహణకు మాత్రం ఈ నెల జూలై 31వ తేదీతో గడువు ముగుస్తుంది. సాధారణ సమావేశం ఉందో లేదో కూడా ఇప్పటి వరకూ తెలియజేయలేదు. గురువారం అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించేందుకు అధికారులు సిద్ధమైనట్టు తెలుస్తోంది. సాధారణ సమావేశం నిర్వహిస్తే వారం రోజులు ముందే అజెండాను అందించాల్సి ఉంటుంది. ఆ పరిస్థితి లేకపోవడంతో అత్యవసర సమావేశం నిర్వహిస్తారని తెలుస్తోంది.

సమాచారహక్కుచట్టం గురించి తెలియజేయాలి

కలకడ: సమాచారహక్కు చట్టం గురించి సామాన్యులకు తెలియజేయాలని మండల ప్రత్యేక అధికారి దయాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి మంగళవారం సమాచార చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి జరిగిన పనులు, ఖర్చులు ప్రజలకు తెలుపడంలో తప్పులేదని, ప్రజల అనుమానాలను నివృత్తి చేయడానికి ఈ చట్టం తీసుకువచ్చినట్లు తెలిపారు. ఎంపీడీఓ భానుప్రసాద్, తహసీల్దారు మహేశ్వరిభాయి, మునీంద్రనాయక్ పాల్గొన్నారు.

పీలేరు: సమాచారహక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో జి.శివశంకర్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై మంగళవారం అవగాహన కల్పించారు. దరఖాస్తు చేసుకున్న వ్యక్తులకు 30 రోజుల్లో సమాచారం ఇవ్వాల్సి ఉందన్నారు. లతీఫ్‌ఖాన్, ఏవో రాజేశ్వరి పాల్గొన్నారు.

31న రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం

రాయచోటి జగదాంబసెంటర్ : ఈ నెల 31వ తేదీన రాయచోటి పట్టణంలోని డైట్ కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అన్నమయ్య జిల్లాస్థాయి సాధారణ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు రాయచోటి డివిజన్ కన్వీనర్ సీఆర్‌వీ సుబ్రమణ్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులు, పెన్షనర్లు అందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

స్కిల్ హబ్ కేంద్రంగా ఎస్‌జీ డిగ్రీ కాలేజ్

పీలేరురూరల్: నిరుద్యోగ యువతకు శిక్షణ ఇస్తూ స్కిల్ హబ్ కేంద్రంగా స్థానిక ఎస్‌జీ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ గుర్తింపు పొందిందని ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి అన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో బ్యూటీషియన్ కోర్సు ఉందని, 30 మంది యువతులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. ఆగష్టు 10 వ తేదీ నుంచి రెండో బ్యాంచ్ శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. వారు కళాశాల కార్యాలయం, స్కిల్ హబ్ సెంటర్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి ధ్వజస్తంభ జీర్ణోద్ధరణ ఉత్సవాలు


లక్ష్మీనరసింహస్వామి ఆలయం

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో నూతన ధ్వజ స్తంభ జీర్ణోద్ధరణ ఉత్సవాలు బుధవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారని ఆలయ ప్రధాన అర్చకులు గోపాలాబట్టర్‌స్వామి తెలిపారు. జులై 30వ తేదీ నుంచి ఆగష్టు 1వ తేదీ వరకు వరకు ఘనంగా ఉత్సవాలను నిర్వహించడానికి టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జులై 30న ఉదయం చతుష్టానార్చన, బింబ, కుంభ, కుండ, ద్వార, తోరణ, అండరాలు, పాతక, దేవతా ప్రతిష్టలు, సాయంకాలం నిత్యవాహన ద్వారపూజలు, ఏకాంతసేవ నిర్వహించనున్నారు. జులై 31న ఉదయం నిత్యావావనాదులు, ధ్వజ స్తంభ అభిషేకం, సాయంత్రం నిత్యహవనాదులు, ఏకాంతసేవ నిర్వహించనున్నారు. ఆగష్టు ఒకటిన మహాపూర్ణాహుతి, ధ్వజస్తంభ నిర్మూలన, బింభ, కుంభ, ధ్వజ స్తంభ ఉద్వాసన, మహనివేదన కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కావున భక్తులు పెద్ద ఎత్తున స్వామివారి ఉత్సవ సేవలో పాల్గొనాలని కోరారు.

వైభవంగా ఉత్సవాలకు అంకురార్పణ

కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకిపురంలో వెలసిన పట్టాభిరామస్వామి ఆలయంలో స్వామివారి పట్టాభిషేక మహోత్సవాలకు మంగళవారం అంకురార్పణ చేశారు. ముందుగా సేనాధిపతి ఉత్సవం నిర్వహించారు.

ఘనంగా నాగుల పంచమి పూజలు


యోగభోగేశ్వరుడు

మదనపల్లె సిటీ: పట్టణంలోని శివాలయాల్లో మంగళవారం నాగుల పంచమి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక బెంగుళూరు రోడ్డులోని యోగభోగేశ్వర స్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక దేవళంవీధిలోని సోమేశ్వర స్వామి ఆలయంలో బాలసుబ్రహ్మణ్యంకు, ఆలయంలో నాగ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రామసముద్రం: మండలంలోని చెంబకూరు నడిబొడ్డున నాగ దేవతలకు భక్తులు విశేష పూజలు నిర్వహించారు.